క్లుప్తంగా

ఆదిత్యనగర్‌లో గోడ తొలగింపునకు చర్యలు



ఆదిత్యనగర్‌లో రోడ్డుకు అడ్డంగా కట్టిన గోడను పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు నగరం పాలెం రోడ్డులోని ఆదిత్యనగర్‌లో రోడ్డుకు అడ్డంగా కట్టిన గోడను తొలగించేందుకు తక్షణ చర్యలు చేపతామని జోన్–2 జెడ్సీ కొట్యాడ కనక మహాలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె ఇక్కడ రోడ్డును ఆక్రమించి ప్రహరీ కట్టిన అపార్ట్‌మెంట్‌ను టౌన్ ప్లానింగ్, ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. ఇక్కడ రోడ్డు ఆక్రమణ వలన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆదిత్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.ఎస్.నాయుడు, కార్యదర్శి నాగోతి సూర్యప్రకాశరావు తదితరులు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో జెడ్సీ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. బిల్డర్ గెడ్డను కూడా ఆక్రమించి పార్కు, ప్లే ఏరియాగా చూపించారని, దానిపై కూడా చర్యలు చేపట్టాలని స్థానికులు, నాయకులు ఫిర్యాదు ఇచ్చారు. కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో పాటు నాయకులు పాల్గొన్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన సిమెంట్ గొట్టాలు



తీరంలోని ఇసుకలో కూరుకుపోయిన సిమెంట్ గొట్టం

కొమ్మాది: మూడు రోజుల నుండి సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు బీభత్సం సృష్టించి, తీరంలో ఉన్న ఇసుక తిన్నెలను తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం తీరానికి సిమెంట్ గొట్టాలు కొట్టుకొచ్చాయి. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు ముందుగా వాటిని చూసి బంకర్లు అనుకుని ఆశ్చర్యపోయారు. తర్వాత వాటిని పరిశీలించాక కల్వర్టుల కింద వాడే సిమెంట్ గొట్టాలుగా నిర్ధారించారు. ఇవి ఎక్కడి నుంచో ఇక్కడికి కొట్టుకొచ్చి తీరం వద్దకు చేరుకున్నాయని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు.

రోడ్డుమీదే బడ్డీ

కొమ్మాది: బీచ్‌రోడ్డు రుషికొండ కూడలి వద్ద ప్రధాన రోడ్డుపై ఓ వ్యక్తి బడ్డీ ఏర్పాటు చేశాడు. ఇటువైపు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అటువంటి రహదారిపై అనధికారికంగా బడ్డీ ఏర్పాటు చేసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ఆక్రమించినా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే రోడ్డు వెంబడి ఉన్న దుకాణాలు తొలగించమని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఇటీవలే పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ రోడ్డుమీదే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం శోచనీయం.

బుల్స్‌పై రాయల్స్ విజయం



విజయతీరానికి చేర్చిన అయ్యప్ప–విజయ్ జోడీ

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ 3 వికెట్ల తేడాతో భీమవరం బుల్స్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బుల్స్ 4 వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో హిమకర్ (81), రేవంత్ (69) రాణించారు. ప్రతిగా రాయల్స్ మరో రెండు బంతులుండగానే ఏడు వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసి విజయాన్నందుకుంది. కెప్టెన్ హనుమవిహారి (37), పాండురంగరాజు (20), రాహుల్(52), విజయ్(36), అయ్యప్ప(26) రాణించారు.

గర్జించిన వైజాగ్ లయన్స్

మరో మ్యాచ్‌లో వైజాగ్ లయన్స్ జట్టు విజయవాడ సన్‌షైనర్స్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌షైనర్స్ 8 వికెట్లకు 185 పరుగులు చేసింది. కెప్టెన్ అశ్విన్‌హెబ్బర్(30), అభినవ్(29), తేజ(33), కెపిఎస్ఎన్ రాజు(53) రాణించారు. యశ్వంత్ 4 వికెట్లు, సాయితేజ రెండు వికెట్లు తీశారు. ప్రతిగా వైజాగ్ లయన్స్ వీరారెడ్డి(104) సెంచరీతోను, రికీబుయ్(58)అర్ధసెంచరీతో రాణించి విజయతీరాలకు చేర్చారు.

జగనన్న పాలనలో మహిళలే మహారాణులు

- పథకాలన్నీ వారి పేరు మీదే అందించారు
- మీ కాళ్లపై మీరు నిలబడేలా చేశారు..
- కూటమి ప్రభుత్వానివన్నీ బూటకపు హామీలే..
- వాటిని ప్రశ్నించేందుకే మీ గ్రామాలకు వచ్చాం
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: గత వైఎస్సార్‌సీపీ అయిదేళ్ల పాలనలో మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సున్నావడ్డీ , చేయూత వంటి పథకాలే కాకుండా అన్నింటికి మహిళల పేరుతో వారి చేతికే అందించారన్నారు. ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవరత్నాల వంటి పథకాలతో ప్రజలను వారి కాళ్లపై వారు నిలబడేలా జగనన్న ఊతమిచ్చారన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం

14 నెలలు గడచినా సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయలేకపోయారన్నారు. వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను కాపీ కొట్టి పేర్లు మార్చినా ప్రజలకు అందించడంలో విఫలం అయ్యారన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీని అటకెక్కించారన్నారు. గంభీరం పంచాయతీలో హెచ్‌టీ లైన్ల సమస్య, తాగునీరు ఇబ్బందులపై ప్రజలు ఏకరువు పెడుతున్నారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతీసారి హామీలన్నీ అమలు చేసేశామని అబద్ధాలు చెప్పడం ఆయన ఆనవాయితీ అన్నారు. చంద్రబాబు ప్రజలకు ఒక ఇల్లు గాని సెంటు స్థలం గాని ఇచ్చిన పాపానపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం బూటకపు హామీలతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయం గురించి తెలియజేయడానికే బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో మీ గ్రామాలకు వచ్చామన్నారు. ఉచిత బస్సు పేరుతో నడిపే బస్సుల ద్వారా మహిళలు జిల్లా దాటలేరన్నారు. కూటమి ప్రభుత్వం మెడలు వంచి సంక్షేమ పథకాలు అమలు చేయిస్తామన్నారు. లేదంటే వచ్చే ఎన్నికలలో ప్రజలే న్యాయనిర్ణేతలుగా వారు ఇచ్చిన అంతిమతీర్పుతో ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామన్నారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీలు బొట్ట ధనలక్ష్మి, రామకృష్ణ, పాండ్రంగి శ్రీను, ఉప్పాడ సూర్రెడ్డి, బోయి అరుణకుమారి, వెంకటరమణ, బోని అప్పలనాయుడు, పాండ్రంగి అప్పారావు, కోరాడ సూర్యారావు, ఇల్లిపిల్లి నరసింగరావు, ఉప్పాడ రామిరెడ్డి, తెడ్లాపు గోవింద్, పిల్లి పైడిరెడ్డి, పల్ల రమణ, ఉప్పాడ అప్పలరెడ్డి, బంక శ్రీను, కోరాడ వెంకటరమణారావు, కలిమి గంగరాజు, గుడ్ల రమణ, లెంక రాంబాబు, బంక కృష్ణమనాయుడు, షిణగం దామోదరరావు, కోరాడ అప్పలస్వామినాయుడు, చందక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్రజాస్వామ్యబద్ధంగా పులివెందుల జెడ్పీటీసీ ఎన్నిక

వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో మంగళవారం జరిగిన జెడ్పీటీసీ ఎన్నిక ప్రక్రియ అప్రజాస్వామ్యబద్ధంగా జరిగిందని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. 10 వేల ఓట్ల కోసం జరిగిన ఈ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గానీ, సెగ్మెంట్‌లో ఓటర్లు గానీ తమ ఓట్లు వేసుకోలేకపోయారన్నారు. ఉదయం నుంచి అక్కడి పోలీసులు ఓటర్లను ఇబ్బందులకు గురి చేసి ఏకపక్షంగా కూటమి అభ్యర్థికి ఓట్లు వేశారన్నారు. పక్క నియోజకవర్గాల నుంచి వచ్చిన పోలీసులు కూడా దొంగ ఓట్లు వేశారన్నారు. రాష్ట్రంలో 150కు పైగా జెడ్పీటీసీ స్థానాలు, అనేక ఎంపీటీసీ సెగ్మెంట్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల స్థానాలు ఖాళీగా ఉన్నా కేవలం వైఎస్ జగన్‌పై పైచేయి సాధించామని అనుకూల మీడియా ద్వారా చెప్పుకోవడానికే ఈ ఎన్నిక నిర్వహించారన్నారు. సాక్షి ఛానల్ ప్రసారాలు నిలిపివేసినా పులివెందుల జెడ్పీటీసీ ఎన్నిక ప్రక్రియను సోషల్ మీడియా ద్వారా ప్రజలంతా గమనించారన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ హరేందిర ప్రసాద్
- గిరిజన గురుకుల ఎస్‌వోఈలో ఆల్బెండజోల్ మాత్రల అందజేత



గిరిజన బాలికల ఎస్‌వోఈలో ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్



రేవిడి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి లీలా ప్రసాద్

మధురవాడ: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మారికవలస గిరిజన గురుకుల ఎస్‌వోఈలో విద్యార్థినులకు మంగళవారం ఆయన ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనా బాగా చదవగలుగుతారన్నారు. నులిపురుగుల వలన ఎనీమియా వస్తుందని, అది రాకుండా ఉండాలంటే భోజనం ముందు చేతులు బాగా కడుక్కోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం మధురవాడ ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించారు. గురుకుల ఎస్‌వోఈతో పాటు, మారికవలస తిమ్మాపురం రోడ్డులోని గిరిజన గురుకుల ఇంగ్లిష్ మీడియం స్కూల్లో నిర్మాణం చేసి అప్పగించకుండా ఉండిపోయిన భవనాల గురించి కలెక్టర్ ఆరా తీశారు. కార్యక్రమంలో డీఈవో ఎస్. ప్రేమ్‌కుమార్, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్‌కుమార్, ప్రోగ్రాం స్టేట్ మానిటర్ రాజీకిరణ్, పీహెచ్‌సీ వైద్యురాలు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో 5987 మందికి..

పద్మనాభం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో 5987 మంది విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 1462 మందికి, పాఠశాలల్లో 4481 మందికి, కాలేజీల్లో 44 మందికి మాత్రలు వేయించారు. రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి లీలాప్రసాద్ మాత్రలు వేశారు. కృష్ణాపురం కస్తూర్బా విద్యాలయాన్ని నులిపురుగుల నివారణ జిల్లా నోడల్ అధికారి ఉమావతి సందర్శించి కార్యక్రమాన్ని పరిశీలించారు.



భీమిలి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఆశ కార్యకర్త, ఏఎన్ఎంలు

భీమిలిలో..

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పంపిణీ చేశారు. టౌన్ పరిధిలో 8,500 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయనున్నారు.

తగరపువలస: డీ వర్మింగ్ డే సందర్భంగా జీవీఎంసీ ఒకటోవార్డు సంతపేట అంబేడ్కర్ హైస్కూల్‌లో ఆరోగ్య సిబ్బంది 250 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మాత్రలు వేసిన తరువాత రెండుగంటల పాటు విద్యార్థులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రమణకుమారి, కుసుమ కుమారి, విమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనే లక్ష్యంగా వైద్యసేవలు



శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సుజాన్, వైద్య సిబ్బంది

పీఎం పాలెం: క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్యాంప్‌ను పీఎం పాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేశామని స్థానిక వైద్యాధికారి డాక్టర్ సుజాన్ పల్లా తెలిపారు. ఈ శిబిరంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, ధూమపానం..మద్యపానం అలవాటున్న వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి, టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు కఫ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్షల్లో క్షయ వ్యాధి నిర్ధారణ అయితే, వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరు నెలల పాటు ఉచితంగా క్షయ నివారణ మందులు సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మధురవాడ టీబీ యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ వీ.వీరబ్రహ్మం, సురేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌పై గ్రామసభ



మాట్లాడుతున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

పద్మనాభం: ల్యాండ్ పూలింగ్ చేపడుతున్న భూముల్లో హక్కు దారులను గుర్తిస్తామని ఆర్డీవో సంగీత్ మాథూర్ అన్నారు. మండలంలోని కొవ్వాడ కాటికాపల్లిలో రైతులతో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. కొవ్వాడలోని నందికొండ వద్ద సర్వే నంబర్ 237లో 350 ఎకరాలు ల్యాండ్ పూలింగ్ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ భూమి మీద ఉన్న హక్కుదారులను గుర్తించేందుకు బుధవారం నుంచి సర్వే చేస్తామన్నారు. ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. అయితే, ఎకరాకు 450 గజాలు, తొమ్మిది వందల గజాలు కాకుండా తమ దగ్గర తీసుకున్న భూమికి తగ్గట్టుగా డబ్బులిస్తే భూములు ఇస్తామని రైతులు ఆర్డీవోకు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆనందరావు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు

పద్మనాభం: ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయడం వల్ల ఉపాధి అవకాశాలు లభిస్తాయని తహసీల్దార్ కె.ఆనందరావు అన్నారు. మండలంలోని కృష్ణాపురం సమీపాన సూదికొండ వద్ద పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణ పనులను చేపట్టవద్దని రెండు రోజుల నుంచి రైతులు అడ్డుకుంటున్నారు. దీంతో తహసీల్దార్ సూదికొండ వద్ద మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంఎస్ఎంఈ పార్కు పనులను అడ్డుకుంటే ఉపాధి అవకాశాలు కోల్పోతారన్నారు. పార్కు నిర్మాణం వల్ల పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యామల పాల్గొన్నారు.

కాపర్ వైర్ దొంగిలించిన ముగ్గురి అరెస్టు

పద్మనాభం: మండలంలో రెండు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు విప్పి, 21 కిలోల కాపర్ వైర్, ఐదు కిలోల అల్యూమినియం చోరీ చేసిన ముగ్గురు దొంగలను పట్టుకుని అరెస్టు చేసినట్లు క్రైమ్ పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాలివి.. జూన్ నెలలో అనంతవరం జగనన్న కాలనీలో ఐదు కిలోల అల్యూమినియం, జూలై 22వ తేదీన రెడ్డిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ విప్పి 21 కిలోల కాపర్ వైర్ దొంగిలించు పోయారు. ఈ చోరీకి పాల్పడిన వారిని పట్టుకోవడానికి మూడు బృందాలను ఏర్పాటు చేశారు. వైర్లను దొంగలించిన విజయనగరం జిల్లా జామి మండలం అన్నంరాజుపేట గ్రామానికి చెందిన కంటుబోతు రాంబాబు, జరజాపు అప్పలనాయుడు, యాతపాలెం గ్రామానికి చెందిన సిమ్మ సోమేష్‌లను ఈ నెల పదో తేదీన అరెస్టు చేశారు. వీరు వైర్లు పట్టుకుని వెళ్తుండగా పద్మనాభంలోని ఘాట్ రోడ్డు వద్ద పట్టుకుని అరెస్టు చేసి, వారి నుంచి వైర్లు స్వాధీనం చేసుకున్నారు. క్రైం సీఐ బీఎస్ఎస్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.శ్రీకాంత్ ఈ మూడు టీమ్‌ల సహకారంతో ముగ్గురిని పట్టుకుని అరెస్టు చేసినట్టు తెలిపారు.

ఫుట్‌బాల్ ఆహ్వాన పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ ఆహ్వాన పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్నిగ్ధశ్రీ జయంతి స్థానిక బంతాట మైదానంలో ఏర్పాటు చేసిన పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల యువతను ప్రోత్సహించిన వారవుతారన్నారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ మాట్లాడుతూ 15వ తేదీ వరకు నాలుగు రోజులు ఈ పోటీలు జరుగుతాయని, ఇందులో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. 15వ తేదీన ఫైనల్స్ జరు గుతాయని, గెలిచి న జట్టుకు నగదు బహుమతి, ట్రోఫీ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మూడో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, సీఐ తిరుమలరావు, ఆహ్వానితులు మైలిపల్లి షణ్ముఖరావు, గంటా నూకరాజు, అక్కరమాని చినబాబు, అత్తిలి చినబాబు, ఫౌండేషన్ సభ్యులు కె.సూర్యనారాయనమూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి



నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న గంగారావు

బీచ్‌రోడ్: విశాఖ డెయిరీలో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులు 305 మందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఈ పోరాటం ఆగదని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కే ఎస్వీ కుమార్ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10 గంటల నుండి మంగళవారం ఉదయం 10 గంటల వరకు నిర్వహించిన దీక్షలో ఆయన పాల్గొన్నారు. కార్మికుల ఓట్లతో గెలిచిన స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ కార్మికులను పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్ కుమార్ ఎటువంటి నోటీసు ఇవ్వకుండా కార్మికులను తొలగించడం శోచనీయమన్నారు. విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. సీపీఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ డెయిరీ యాజమాన్యం మెడలు వంచి కార్మికులంతా విధులకు వెళ్తారని, వారికి తాను అండగా ఉంటానని తెలిపారు. దీక్షలో పాల్గొన్న కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ కుమార మంగళం, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

గోస్తని గుండెకోత



తాటితూరు వద్ద గోస్తని నది పరిస్థితి



సామియ్యవలస వద్ద అడుగంటిన గోస్తని నది

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో గోస్తనినది పరిస్థితి చాలాప్రాంతాల్లో దయనీయంగా తయారైంది. రెండు మాసాలుగా సరైన వర్షాలు కురవకపోవడం, తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల కాకపోవడంతో చాలాచోట్ల నీరు అడుగంటిపోయి నేల కనిపిస్తోంది. విజయనగరం జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా పద్మనాభం, ఆనందపురం మండల పరిధిలో కాస్త నీరు ఉన్నా దిగువన భీమిలి మండలానికి వచ్చేసరికి నీరు పూర్తిగా ఇంకిపోయి కనిపిస్తోంది.

తాగునీటి వెతలు

నదిలో నీరు లేకపోవడంతో జీవీఎంసీ భీమిలి జోన్‌లో తాగునీటి కోసం ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కుళాయిల ద్వారా సరఫరా అయ్యే కొద్దిపాటి నీరు కూడా బురదను తలపిస్తోంది. వాటర్ ప్లాంట్ల యజమానులు కూడా తమ బోర్లు ఎండిపోవడంతో వాటర్ ట్యాంకర్లను ఆశ్రయించి నీటిని కొనుక్కుంటున్నారు. జూలై మొదలుకుని తగరపువలస, చిట్టివలస, సంగివలస పరిధిలో చాలా చోట్ల బోరుబావులు, నేలబావులలో నీరింకిపోయింది. వ్యక్తిగత బోర్లు ఎండిపోయిన చోట రూ.లక్షలు వెచ్చించి తిరిగి కొత్త బోర్లు తవ్విస్తున్నారు. ఇప్పట్లో వర్షాలు కురిసే అవకాశం లేనప్పుడు తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడమే చివరి ప్రయత్నంగా చూడాలని భీమిలి జోన్ ప్రజలు కోరుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో జీవీఎంసీ పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయితీ సామియ్యవలస వద్ద రూ.6.50 లక్షలు ఖర్చు చేసి నీటిని ఒడిసి పట్టేందుకు నదిలో అడ్డంగా ఉంచిన ఇసుక బస్తాలు కూడా సత్ఫలితాలు ఇవ్వలేదు. దీంతో సామియ్యవలస, మజ్జివలస, తాటితూరు, నగరపాలెం ప్రాంతాలలో కూడా గోస్తనినది అడుగంటిపోయి కనిపిస్తుంది.

ఘనంగా యువజన దినోత్సవం

తగరపువలస: అనిట్స్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇ–లాస్ క్లబ్ విద్యార్థులు నాచ్‌లే నృత్య కళాపోటీలతో పాటు పుస్తక సమీక్ష పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకు, ఆటలకు పరిమితం కాకుండా దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. క్లబ్ అధ్యాపక నిర్వాహకురాలు సత్యఫణికుమారిని అభినందించారు.న్యాయనిర్ణేతలుగా సుధాసింగ్, డేనియల్ రాజు, దివ్య, రమేష్‌బాబు, అబీబున్నీషా బేగం వ్యవహరించారు.



జగన్మాత.. త్రివర్ణ శోభిత

దివీస్ రోడ్డులోని మద్దిపేట వద్ద గుడివాడ గ్రామదేవత తోగాలమ్మ త్రివర్ణ శోభితగా దర్శనమిచ్చారు. జాతీయ జెండాలోని కాషాయ రంగును ప్రతిబింబించేలా కనకాంబరాలు, శ్వేత వర్ణం కోసం మల్లెలు, జాజులు, ఆకుపచ్చరంగు కోసం తులసిమాలలతో అమ్మవారిని నేత్రపర్వంగా అలంకరించారు. వెనుక త్రివర్ణ పతాకాన్ని ఉంచారు. అమ్మవారిని పరిసరగ్రామాల ప్రజలు దర్శించుకుని పూజలు చేశారు. - తగరపువలస



సుమధురం.. సుమనోహరం..

భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాసపోలమాంబ పంచదార చిలుకల అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని మంగళవారం 117వ అలంకరణలో భాగంగా తెలుపు, గులాబీ రంగుల పంచదార చిలుకలు, జర్బరా పువ్వులతో విశేషంగా అలంకరించారు. విజయనగరానికి చెందిన కలిశెట్టి సురేష్, గౌరి, యశ్వంత్, వెంకటసాయి ఈ అలంకరణకు సహకారం అందించారు. - తగరపువలస